# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వికసిత భారత్ -2047 లో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.**
2. **రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**
3. **శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు.**
4. **రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.**
5. **వాతావరణ కాలుష్య నివారణా చర్యలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

=========================

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా కోల్లిపర గ్రామంలో 4 కోట్ల 19 లక్షల రూపాయలతో నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఈరోజు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

**( వాయిస్ 28 సెకన్లు )**

-------------------------

వికసిత భారత్ -2047 కలను సాకారం చేసేందుకు మహిళల యొక్క భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రపంచ స్థాయిలో లేసు అల్లికలతో నరసాపురానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత మహిళలదేనని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో అయిదురోజుల పాటు జరిగే జాతీయ హస్త కళల ఎగ్జిబిషన్‌ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ హస్త కళాకారుల ఎగుమతి ప్రోత్సాహక మండలి దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకారులను ఒక చోటికి చేర్చడం జరిగిందన్నారు. వారు తయారు చేసే వివిధ వస్తువులను జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేయడానికి, మద్దతుగా నిలుస్తున్నామని పేర్కొంటూ..

**( వాయిస్ 29 సెకన్లు )**

-------------------------

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.. స్వామి వారి దర్శనానంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..ఆలయంలో సరైన మౌలిక సదుపాయాలు లేని కారణంగా భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని.. వీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా సుమారు వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో భక్తుల సౌకర్యార్ధం తాత్కాలిక షెడ్లు నిర్మించాలని ఆలయ అధికారులను అచ్చెన్నాయుడు ఆదేశించారు.

-----------------------------

రాష్ట్రంలో 93 వేల మంది వితంతువులకు మే నెల నుండి కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గంట్యాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా దాదాపు 5 లక్షల మంది పింఛన్లకు అర్హులుగా గుర్తించమని వారందరికీ త్వరలోనే పింఛన్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి కల్పన, మహిళల స్వయం సాధికారత, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మండలాన్ని ఓ యూనిట్‌గా తీసుకుని విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి మండలానికి ఒక మహిళా భవనం నిర్మించి, దాన్ని శిక్షణా కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి వివరించారు.

-----------------------------

రాష్ట్రంలో పచ్చదనం.. పరిశుభ్రతను పెంచేందుకు 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి ఈ రోజు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ..

**( వాయిస్ 20 సెకన్లు )**

-----------------------------

క్షయ నిర్మూలనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ కోరారు. రేపు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో నిన్న గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతీ నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. ప్రధానమంత్రి టి.బి. ముక్త భారత్ అభియాన్ క్రింద వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ మిత్ర దాతల ద్వారా పోషకాహారం అందజేస్తున్నామని తెలిపారు. దాతలుగా ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహరించాలని కలెక్టర్ కోరారు.

-----------------------------

రాష్ట్రంలోని అనపర్తి నియోజకవర్గం బలభద్రపురం గ్రామంలో .. క్యాన్సర్ కేసుల నమోదు విషయంలో ఎటువంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు.

జాతీయ సగటు ప్రతి 10 వేలకి 30 మందికి క్యాన్సర్ కేసుల నమోదు అవుతుండగా, గ్రామంలో 23 కేసులు గుర్తించమని ఆమె పేర్కొన్నారు. గ్రామస్థులకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక వైద్య బృందం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతోందని, ఈరోజు కూడా గ్రామాలలో పర్యటించి పరిస్థితిని వివరించడం జరిగిందని అన్నారు. అనుమానిత కేసుల విషయంలో కూడా తగిన విధంగా పరీక్షలు నిర్వహించేందుకు, అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు  జిల్లా కలెక్టర్ ప్రశాంతి వెల్లడించారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 25, 30వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం  ఓ ప్రకటనలో తెలిపింది. 25న కోయిల్ఆళ్వార్ తిరుమంజనం, 30వ తేదీన ఉగాది పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు TTD పేర్కొంది. దీంతో 24, 29వ తేదీల్లో ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది.

---------------------------

పల్నాడు జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి కంచి శ్రీనివాస రావు పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్ పై సమాచారాన్ని వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు నని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డయల్ 100 లేదా 112 కు సమాచారం అందించవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

---------------------------

వాతావరణ కాలుష్య నివారణా చర్యలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. వాతావరణ మార్పులను అంచనా వేయడం, భూతాపాన్ని తగ్గించడం, ప్రకృతిని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అడవులను విచక్షణా రహితంగా నరికి వేయడం, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలను అధికంగా వినియోగించడం వంటి చర్యలకు స్వస్తి పలకడం ద్వారా మనం వాతావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని  పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్రకృతి సమతూకాన్ని కాపాడుతూ ప్రస్తుత, భవిష్యత్ తరాల వారికి ఉజ్వల భవిష్యత్ అందించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.  1950వ సంవత్సరం మార్చి 23న ప్రపంచ వాతావరణ సంస్థ ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈరోజును ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ……

**( వాయిస్   31   సెకన్లు )**

====================